



రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కైకరం విద్యార్థులు


ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అండర్-17 బాలుర విభాగంలో ఉంగుటూరు మండలం కైకరం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఏలూరులోని ఎఎస్ఆర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు చేబ్రోలు శ్రీనివాసకుమార్ వెల్లడించారు. ఎస్.దివ్యనాగసత్య, బి.కృష్ణచైతన్య, బి.నాగదుర్గ చైతన్య, కె.యశ్వంత్, బి.జోసఫ్ మెర్విన్‌లను ఈ సందర్భంగా అభినందించారు. క్రీడాకారులకు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.సుజాత, టి.రాహుల్‌ను గ్రామస్థులు, ఎస్ఎంసి నేతలు, సభ్యులు అభినందించారు.

సమస్యలపై గళమెత్తేనా..!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
రెండు జిల్లాల్లో ప్రజలను వెంటాడుతున్న సమస్యలు అనేకం
రోడ్ల వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్థం
పోలవరం నిర్వాసితుల పరిస్థితి అత్యంత దుర్భరం
ఆక్వా, మొక్కజొన్న, కోకో రైతుల సమస్యలపై ప్రశ్నించేనా
భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంపై చర్చ సాగేనా



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ స్థానాల నుంచి కూటమి ఎంఎల్‌ఎలే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు వంటి అనేక సమస్యలు ఇక్కడి ప్రజానీకాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్‌ఎలు తమ నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు లేవనెత్తాలని అంతా కోరుతున్నారు. రెండు జిల్లాలో రాష్ట్ర, మీడియం రహదారులు దాదాపు మూడు వేల కిలోమీటర్లకుపైగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ రోడ్లు మొత్తం అస్తవ్యస్థంగా మారాయి. ఏలూరు-జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం-బుట్టాయగూడెం రోడ్డు, ఏలూరులో కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే వంగాయగూడెం రోడ్డు, టి.నరసాపురం-జీలుగుమిల్లి రోడ్డు, వీరవాసరం-బ్రాహ్మణచెర్వు, వెంప-మొగల్తూరు రోడ్లు ఇలా రెండు జిల్లాల్లోనూ రోడ్లన్నీ గోతులమయంగా మారి వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో రోడ్ల మరమ్మతులకు రూ.196.55 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనాలు సైతం రూపొందించారు. పశ్చిమలోనూ అదేవిధమైన పరిస్థితి ఉంది. వైసిపి ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి గురించి తీవ్ర విమర్శలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు రోడ్ల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని రోడ్ల సమస్యపై అసెంబ్లీలో ఎంఎల్‌ఎలు లేవనెత్తాలని ప్రజలు కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 20 వేల నిర్వాసిత కుటుంబాలకు సంబంధించి ఇప్పటికీ పరిహారం అందలేదు. 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి గడిచిన మే నెలకు తరలిస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారంగాని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, కాలనీల నిర్మాణం ఏఒక్కటీ చేయని పరిస్థితి ఉంది. దీంతో ఈ ఏడాది మూడు, నాలుగుసార్లు గోదావరి వరద విరుచుకుపడటంతో నిర్వాసితులంతా కంటిమీద కునుకు లేకుండా గడపాల్సి వచ్చింది. తమ సమస్యలపై స్థానిక ఎంఎల్‌ఎ అసెంబ్లీలో మాట్లాడాలని నిర్వాసితులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

నలిగిపోతున్న జిల్లా రైతాంగం..

జిల్లాలోని ప్రధాన పంటలైన ఆక్వా రైతులు ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు విలవిల్లాడుతున్నారు. ధరలు పడిపోయాయి. మేత ధర అందనంత ఎత్తుకు ఎగబాకింది. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.లక్షల్లో బిల్లులు బాదేస్తున్నారు. వైరస్ విజృంభించి ఆక్వా అంతా తుడిచిపెట్టుకుపోతుంది. ఫలితంగా ఆక్వా రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. అసెంబ్లీలో ఆక్వా రైతుల సమస్యలను ఎంఎల్‌ఎలు లేవనెత్తాలని అంతా కోరుతున్నారు. అక్టోబర్ నుంచి మొక్కజొన్న సాగు మొదలుకానుంది. జిల్లాలో లక్షకుపైగా ఎకరాల్లో ఈ సాగు ఉంది. మొక్కసీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాయకుండా సీడ్స్ సరఫరా చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇస్తున్న నాసిరకం సీడ్స్‌తో రైతులు ప్రతియేటా తీవ్రంగా నష్టపోతున్నారు. సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై అసెంబ్లీలో లేవనెత్తితేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కోకో రైతులు ధరలేక తీవ్ర నష్టాలను చవిచూశారు. ఇకనుంచి అటువంటి పరిస్థితి లేకుండా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రంలో జిల్లాలోనే అత్యధికంగా దాదాపు 40వేల ఎకరాల్లో కోకో సాగు సాగుతోంది. కోకో రైతుల సమస్య పరిష్కారానికి ఎంఎల్‌ఎలు అసెంబ్లీలో లేవనెత్తాలని కోకో రైతులు కోరుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రైతుల గురించి మాట్లాడతారా?

తెలంగాణ నుంచి దేవరపల్లి వరకూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీసు రోడ్లు నిర్మించకపోవడంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్లు నిర్మించాలని కొన్ని నెలలుగా స్థానిక రైతాంగం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. అధికారులు చెబుతున్న మాటలు ఏమాత్రం ఆమోదయోగ్యంగా ఉండటం లేదు. గ్రీన్‌ఫీల్డ్ రైతుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని అక్కడి రైతులు కోరుతున్నారు.

భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంపై మాట్లాడేనా..

విభజిత పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో నూతన కలెక్టరేట్ నిర్మాణంపై రాజకీయ దుమారం రేగుతోంది. కలెక్టరేట్ నిర్మాణం ఉండి నియోజకవర్గ పరిధిలో నిర్మించాలని ఒకపక్క, భీమవరం పట్టణంలో నిర్మించాలని మరోపక్క తీవ్ర వాగ్వివాదాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. దీంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణం సమస్యపై అసెంబ్లీలో స్పష్టత ఇవ్వాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు, డ్రెయినేజీ, టిడ్కో ఇళ్లు వంటి అనేక సమస్యలతో జనం సతమతం

డెల్టాలో తాగునీరు పూర్తిగా దెబ్బతింది. ఆక్వా సాగుతో తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకడం లేదు. వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీరు అందిస్తామని మాటలు చెప్పడం తప్ప చర్యలు లేకుండా పోయాయి. ఏలూరు జిల్లాలోనూ పరిస్థితి అదేవిధంగా ఉంది. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకుండాపోయింది. టిడ్కో ఇళ్లు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ పట్టించుకోని పరిస్థితి. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎటువంటి సాయమూ అందడం లేదు. గత టిడిపి ప్రభుత్వంలో నిర్మించుకున్న ఇళ్లకు పరిహారం మాటలకే పరిమితమైంది. పింఛన్ల ఏరివేతపైనా తీవ్ర అలజడి నెలకొంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో ఎంఎల్‌ఎలు తమ గళం వినిపించినప్పుడే పరిష్కారం దొరుకుతుంది.

2 నాటికి డంపింగ్ యార్డుల్లో చెత్త తొలగింపు

ఏలూరు డంపింగ్ యార్డును పరిశీలించిన మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ బుధవారం ఏలూరులో పర్యటించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, వివిధ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముందుగా పోణంగిలోని ఘనవ్యర్థాల నిర్వహణా కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఘన వ్యర్థాల నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అక్టోబర్ 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డ్‌లో చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిందన్నారు. తమ ప్రభుత్వం ఇంతవరకు 83 లక్షల టన్నుల చెత్తను తొలగించిందని, అక్టోబర్ 2వ తేదీ నాటికి మిగిలిన 2 లక్షల టన్నుల చెత్తను తొలగిస్తామన్నారు. డంపింగ్ యార్డుల్లో భూమిపైన కనిపించే చెత్త మాత్రమేనని, భూమి లోపల మరో 15 లక్షల టన్నుల వరకు చెత్త ఉంటుందని అన్నారు. దీనిని నవంబర్ నెలాఖరు నాటికి తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ గత ప్రభుత్వం డంపింగ్ యార్డులో వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించకుండా కాల్చి, పర్యావరణానికి విఘాతం కలిగించడంతోపాటు ఈ ప్రాంత ప్రజలు కాలుష్యం బారిన పడేలా చేశారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఏలూరు డంపింగ్ యార్డ్‌లోని ఘన వ్యర్థాల్లో 63 శాతం నిర్వహించామని తెలిపారు. మంత్రి వెంట ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఏలూరు కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థుల తరలింపునకు ఏర్పాట్లు

నేటి రాత్రికి ఏలూరులో బస

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి-2025లో ఎంపికైన అభ్యర్థులతో ఈ నెల 19న ముఖ్యమంత్రి వెలగపూడిలో సభ ఏర్పాటు చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎంపికైన 1063 మంది డిఎస్‌సి అభ్యర్థులను అక్కడికి తరలించేందుకు విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులందరినీ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు వారికి కేటాయించిన వసతి కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలని ఇప్పటికే సమాచారం పంపారు. ఈ నేపథ్యంలో ఏలూరులోని కస్తూరిబాయి పాఠశాల, సుబ్బమ్మదేవి పాఠశాల, గాంధీ మున్సిపల్ హైస్కూల్, సురేష్ బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెయింట్ థెరిస్సా హైస్కూల్, సెయింట్ గ్జేవిఆర్ హైస్కూల్, చైతన్య హైస్కూల్, శశి హైస్కూల్, శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ల్లో వారికి వసతి ఏర్పాటు చేశారు. వారందరికీ గురువారం రాత్రి ఆయా కేంద్రాల్లో భోజనం ఏర్పాటు చేస్తారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు వారికి అల్పాహారం అందించి అనంతరం బస్సుల్లో వెలగపూడి తరలిస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు సభ నేపథ్యంలో గన్నవరంలో వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గోదావరి వరద తగ్గుముఖం

ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఐదు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో మంగళవారం 38 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం బుధవారం నాటికి 31 అడుగులకు తగ్గింది. మండల పరిధిలో కూడా గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. అయితే కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, రోగులు 15 కిలోమీటర్లు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోంది.


కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్ వేపై ఉన్న గోదావరి వరద

వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని మిర్చి, పత్తి, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదేవిధంగా వరద తగ్గితే మరో రెండు రోజుల్లో కుక్కునూరు-దాచాంం మధ్య రాకపోకలు ప్రారంభమవుతాయి.

వేలేరుపాడు రూరల్: గోదావరి తగ్గుముఖం పట్టినా ఎడవల్లి వద్ద ఎద్దు వాగు కాజ్‌వే ముంపులోనే ఉంది. దీంతో కొయిదా, ఎడవల్లి, కాకిసునూరు, కట్కూరు తదితర 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజులుగా ఎద్దు వాగు కాజ్‌వే నీట మునిగే ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరి, మినుము, ప్రత్తి పంటలు వేసిన రైతులు ఎరువులు తెచ్చుకోవడానికి నానావస్థలు పడుతున్నారు.


ఎద్దు వాగు వద్ద బోటుపై ప్రజలను దాటిస్తున్న పోలీస్ సిబ్బంది

పోలవరం నుంచి 6,60,977 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: ఎగువ రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పెరిగిన గోదావరి నీటిమట్టం బుధవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరం నుంచి 6,60,977 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు జల వనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31.100 మీటర్లు, స్పిల్వే దిగువన 22.100 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 31.450 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 21.650 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.060 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

విశ్వకర్మను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆమె విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలో కుల వృత్తులు ఎంతో కీలకమైనవన్నారు. విశ్వబ్రాహ్మణ నాయకులు తెలిపిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వెట్రిసెల్వి తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, జిల్లా బిసి. సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకర్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం, ఐసిడిఎస్ పీడీ శారద, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఎన్‌టిఆర్ ట్రస్ట్ జిల్లా అధికారి డాక్టర్ రాజీవ్, విశ్వబ్రాహ్మణ ప్రముఖులు పొట్నూరి శివరాం, ఎలబాక కృష్ణ, కేళ్ల దుర్గాప్రసాద్, కెవి.బ్రహ్మం, పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం-శ్రీనివాసపురం రోడ్డు త్వరలో పూర్తి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం-శ్రీనివాసపురం రోడ్డు త్వరలో పూర్తి చేయనున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ తెలిపారు. ఆమె బుధవారం జంగారెడ్డిగూడెంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసపురంలో జెడ్‌పిటిసి సభ్యులు సభ్యులు పోల్నాటి బాబ్జి ఇంటి వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ మాట్లాడారు. జెడ్‌పిటిసి బాబ్జి మండలంలో అభివృద్ధి పనుల కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఆయన ద్వారా ఈ ఏడాది కాలంలో రూ.2.50 కోట్ల జెడ్‌పి నిధులతో జంగారెడ్డిగూడెం మండలంలో కొన్ని అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. అంగన్వాడీ సెంటర్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు జెడ్‌పి నిధులు ఇస్తామని తెలిపారు. శ్రీనివాసపురంలో నిర్మించిన అంగన్వాడీ భవనం, సీసీ రోడ్డు ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో, చక్రదేవరపల్లి, లక్కవరం గ్రామాలలో అంగన్వాడీ భవనాలు, సిసి రోడ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, పెనుమర్తి రామకుమార్, జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎంఎల్‌ఎ

రాష్ట్రీయ పోషణ మహోత్సవ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ శారద

ఏలూరు సర్వజన ఆసుపత్రి పరిధిలో స్వస్థ్ నారి-స్వశక్త్ పరివార్ అభియాన్ పోషణ్ 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవ-2025 కార్యక్రమాన్ని ఐసిడిఎస్ పీడీ పి.శారద బుధవారం ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబానికి పునాది అనే నినాదంతో ఈ కార్యక్రమం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థూలకాయ నివారణ, బాల్యదశ సంరక్షణ, విద్య, శిశు సంరక్షణ, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు, పురుషుల భాగస్వామ్యం, డిజిటలైజేషన్ ద్వారా సమగ్ర పోషణ అనే అంశంలో ఈ నెల రోజులు కార్యక్రమాలు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు, ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.పద్మావతి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌కు వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిఎస్‌డబ్ల్యుఎస్ జెఎసి సభ్యులు ఇడా నరేష్ కోరారు. ఈ మేరకు చితలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో సచివాలయ ఉద్యోగాల సమస్యల గురించి మాట్లాడాలని కోరామని చెప్పారు. ఈ నెల ఎనిమిదో తేదీన సచివాలయ శాఖ డైరెక్టర్‌కు రాష్ట్ర వ్యాప్త సమ్మె నోటీసు అందించి సిబ్బందికి ఎదురవుతున్న అనేక సమస్యలు వివరించామని చెప్పారు. ప్రొబేషన్ కాలానికి సంబంధించిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ లేకుండా ఒకే క్యాడర్‌లో ఆరేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్సెడ్ స్కీమ్ అప్లై చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రొబేషన్ ఆలస్యం అవడం వల్ల కోల్పోయిన తొమ్మిది నెలల బకాయిలు, ప్రతి శాఖలో సీనియారిటీ లిస్ట్ తీసి, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్థికేతర అంశాలైన నిర్దిష్ట జాబ్ చార్ట్ అప్లై చేస్తూ, ప్రతి చిన్న దానికి ఇంటింటి సర్వేల పేరుతో ప్రజల వద్ద వేలిముద్ర, ఒటిపిలు తీసుకోవడం వల్ల ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఇ.నరేష్, దుర్గారావు, రాజ్‌కుమార్, రామకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం : వినతిపత్రం అందిస్తున్న నరేష్

ఎంపిడిఒకు సచివాలయ ఉద్యోగుల వినతి

జీలుగుమిల్లి : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్‌కు వినతిపత్రం అందించినట్లు మండల సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొబేషన్ కాలానికి సంబంధించిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ లేకుండా ఒకే క్యాడర్‌లో ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ అప్లై చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రొబేషన్ ఆలస్యం అవడం వల్ల కోల్పోయిన తొమ్మిది నెలల బకాయిలు, ప్రతి శాఖలో సీనియారిటీ లిస్ట్ తీసి, ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయడం ంటి సమస్యలతో పాటు ఆర్థికేతర అంశాలైన నిర్దిష్ట జాబ్ చార్ట్ అప్లై చేస్తూ, ప్రతి చిన్న దానికి ఇంటింటి సర్వేల పేరుతో ప్రజల దగ్గర వేలిముద్ర, ఒటిపిలు తీసుకోవడంతో ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారని వినతిలో పేర్కొన్నామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సచివాలయ ఉద్యోగులు సురేష్, సాయిరామ్, మధురవాణి, దీపిక, శ్వేత, సుబ్బలక్ష్మి, రాజు పాల్గొన్నారు.

పట్టెన్నపాలెం వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తాత్కాలిక మర మ్మతులతో ప్రజాధనం వృధా చేయకుండా పట్టెన్నపాలెం వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం మండలాలను కలుపుతూ మధ్యలో ఉన్న పట్టెన్నపాలెం వంతెన వద్ద నిర్మించిన తాత్కాలిక కాజ్ వేపై నుంచికొండవాగుల నుంచి వచ్చిన నీరు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తుంది. పరిస్థితిని బుధవారం ఫ్రాన్సిస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టెన్నపాలెం వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి 15 ఏళ్లు దాటిందని, ఇప్పటికీ పూర్తి కాలేదని చెప్పారు. చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వలేదని పనులు మధ్యలో ఆపేశారన్నారు. వరదలు వస్తే కొట్టుకుపోయే తాత్కాలిక కా జ్ వేను చింతలపూడి, పోలవరం ఎంఎల్‌ఎలు రోషన్‌కుమార్, బాలరాజు మూడు రోజుల క్రితం ప్రారంభించారన్నారు. ఈ కాజ్ వే కాంట్రాక్టర్లకు, అధికారులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆర్థికంగా ఉపయోగం తప్ప ప్రజలకు ఉపయోగం లేదన్నారు. కాలువ ఉధృతంగా వస్తే హాస్పిటల్‌కు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. పట్టెన్నపాలెం వంతెనను త్వరగా పూర్తి చేయాలని కోరారు. లేకుంటే దళిత, గిరిజన సంఘాలు, రైతు సంఘాలు ఉద్యమానికి సిద్ధమవుతాయని హెచ్చరించారు.


మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆర్‌జియుకెటి విద్యార్థుల ప్రతిభ

పలువురి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడులోని కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ 2025-26 విద్యాసంవత్సరపు మొదటి త్రైమాసికంలో విద్యార్థులు సాధించిన విశిష్టమైన క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలను ప్రకటించడంలో ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ కాలంలో అనలోగ్ డివైసెస్, సెరెమారిక్, ఎఎస్‌సి, ఎన్ఎక్స్‌పి డబ్ల్యుఐటి, ఓమ్నీ డిజైన్ టెక్నాలజీస్, వ్యాల్యూ క్రీడ్, చెక్రెడ్, క్యాస్టెక్, హాల్మార్క్, గ్రిడ్‌లెక్స్, టెక్‌వెడికా, ఎంహెచ్‌కె ఎఫ్ట్రానిక్స్, ఫోర్సిస్ వంటి 40కు పైగా ప్రతిష్టాత్మక సంస్థలు క్యాంపస్‌ను సందర్శించాయి. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ల ద్వారా 162 మంది విద్యార్థులు నెలకు రూ.15 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు స్టైఫండ్‌తో ఇంటర్న్‌షిప్‌లు సాధించారు. 14 మంది విద్యార్థులు ఐఐటి బాంబే, ఐఐటి మద్రాస్, ఐఐటి హైదరాబాద్, ఇండియన్ స్టాండర్డ్స్ బ్యూరో, డిఫెన్స్ రీసర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లో ప్రతిష్టాత్మక పరిశోధనా ఇంటర్న్‌షిప్‌లు పొందారు. ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులను పలువురు అభినందించారు.

మోసపూరిత ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దు

డిఎంహెచ్‌ఒ పిజె.అమృతం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో ఉన్న ప్రయివేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు, లేబరేటరీలకు, స్కానింగ్ సెంటర్ల, మెడికల్ షాపు నిర్వాహకులకు పలువురు వ్యక్తులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అని, కార్యాలయ సిబ్బంది అని ఫోన్లు చేసి డబ్బులు అడుగుతున్నట్లు దన దృష్టికి వచ్చిందని డిఎంహెచ్‌ఒ పిజె.అమృతం తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, వివిధ అనుమతులు ఇస్తామంటూ డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందని చెప్పారు. మోసపూరిత ఫోన్ కాల్స్‌ను నమ్మి ఎవరూ డబ్బు పోగొట్టుకోవద్దని, తెలిపారు. ఇటువంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థుల భోజనంలో పురుగులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఉన్న మెస్ భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థులు తీవ్రభయాందోళన వ్యక్తం చేశారు. మెస్‌ల్లో భోజనం నిర్వహణ సక్రమంగా లేదని అనేక సందర్భాల్లో కళాశాల యాజమాన్యానికి విన్నవించినప్పటికీ పెడచెవిన పెట్టారని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇబ్బందులను గుర్తించి తక్షణమే మెస్సుల నిర్వహణను అక్షయపాత్రకు అందించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


భోజనంలో పురుగు

భోజనంలో పురుగులు రావడంతో అర్ధాకలితో వెళ్లిన విద్యార్థులు ఫుడ్ కోర్టులో ఆహారం కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరిస్తున్నారు. పరిశుభ్రమైన, నాణ్యతా ప్రమాణాలు పాటించే ఆహారం అందించకపోతే ఐకమత్యంగా ఆందోళన చేస్తామంటూ విద్యార్థులు హెచ్చరిస్తున్నారు.

నీరజ కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరు గ్రామానికి చెందిన బి.ఫార్మసీ విద్యార్థిని బి.నీరజ ఇటీవల రామిలేరు వాగులో గల్లంతై మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి కొలుసు పార్థసారధి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. సొంత నగదు రూ.15 వేలు అందించారు. తెలుగుదేశం పార్టీ తరపున రూ.ఐదు లక్షలు, ప్రభుత్వం తరపున వచ్చే సహాయం, మృతురాలి సోదరి శైలజ ఫీజు రూ.30వేలు, మరుగుదొడ్డి వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి పక్కా ఇళ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

నూజివీడును స్మార్ట్ సిటీగా చేసేందుకు కృషి

నూజివీడు పట్టణాన్ని స్మార్ట్ సిటీగా శరవేగంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ముంపు వార్డులను, ఎన్‌టిఆర్ కాలనీని, బాపు నగర్, మొఘల చెరువు, 11 వార్డుల్లో చేసిన పనుల ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌టిఆర్ కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది మునుపెన్నడూ లేని విధంగా శరవేగంగా శానిటేషన్ పనులు చేపట్టారన్నారు. ప్రస్తుతం నూజివీడు పట్టణం అభివృద్ధి పథంలో నడుస్తుందని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

మండలంలోని పల్లెర్లమూడిలో రూ.2.54.కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పార్థసారధి శంకుస్థాపన చేశారు. నాబార్డు, నరేగా నిధులతో మర్రిబందం, ఎంఎన్.పాలెం, పల్లెర్లమూడి గ్రామాలను అనుసంధానం చేస్తూ సుమారు రెండు కిలోమీటర్ల సీసీ బిటి రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

స్థానిక 16వ వార్డుకు చెందిన పులిచెర్ల శారద వైద్య చికిత్స నిమిత్తం రూ.50 వేల ఎల్ఓసి చెక్కు, ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన షేక్ అక్తరునిస్సాకు రూ.రెండు లక్షల ఎల్ఓసి చెక్కును రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అందించారు.

ఎంపిడిఒగా మణికుమారి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఎంపిడిఒగా జి.మణికుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. టి.నర్సాపురం ఎఒగా బాధ్యతలు నిర్వహించిన ఆమె ఉద్యోగోన్నతిపై పోలవరం వచ్చారు. పోలవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా భాధ్యతలు నిర్వహించిన చెరుకూరి శ్రీనివాసబాబు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి బాధ్యతలు అప్పగించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మణికుమారి

శ్మశానవాటికకు దారి లేక అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు బురాయగూడెం వాసులు నానా అవస్థలు పడుతున్నారు. నగరంలోని 19వ డివిజన్ బురాయగూడెం గ్రామంలో ఎవరైనా చనిపోతే వారిని శ్మశాన వాటికకు తీసుకువెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని శ్మశానానికి తరలించేందుకు ఒక చిన్న కాలువ దాటాల్సి ఉంటుంది. వర్షం కురిస్తే ఓ పక్క బురద మరోపక్క కాల్వలో నీరు దాటుకుని వెళ్లాల్సిన దుస్థితి. ఆ సమయంలో శవపేటికను మోసేవారు అదుపుతప్పి మట్టిలో పడిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బుధవారం మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేందుకు నానా అవస్థలు పడ్డారు. కాలువను దాటేందుకు సరైన చిన్నపాటి వంతెన గాని, నడిచేందుకు వీలుగా రోడ్డు గాని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా, ఎంతమందికి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.


మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్న బంధువులు

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వం తమ ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ లతీఫ్ పాషాను కలిసి మండల విఆర్‌ఎలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు విఆర్‌ఎలు మాట్లాడుతూ పే స్కేలు అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సేవకుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మూడు రోజులు పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 18, 19 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలు అందిస్తామని, 20న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, 22న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలను నిర్వహించి వినతి పత్రాలు అందిస్తామని విఆర్‌ఎలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎలు రాజేష్, సురేష్, అన్నామణి, సునీత, సాయి, ముసలయ్య, కోటేశ్వరరావు, సుమతి, చంద్రకాంత్, హుస్సేన్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వీధి కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీలో వీధి కుక్కల దాడిలో గాయాలపాలయ్యే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. బుధవారం ముగ్గురు గాయాలపాలయ్యారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వద్ద ఒక వ్యక్తిపై వీధి కుక్కలు దాడి చేశారు. పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు విద్యార్థులపై దాడి చేస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వీధి కుక్కల బారీ నుంచి విద్యార్థులను, ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

శ్రీగంధం చెట్లు స్మగ్లింగ్ చేస్తున్న ముఠా అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

శ్రీగంధం చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర ఆధ్వర్యంలో సిఐ ఎంవి.సుభాష్ పర్యవేక్షణలో తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు, జంగారెడ్డిగూడెం ఎస్ఐ ఎస్‌కె.జబీర్, క్రైమ్ పార్టీ ఎస్ఐ సంపత్‌కుమార్, రమేష్, చిట్టిబాబు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. తన పామాయిల్ తోటలో పెంచుతున్న శ్రీ గంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి, తనని కూడా చంపుతామని బెదిరించి మెడలో ఉన్న బంగారపు గొలుసు దొంగిలించారని కామవరపుకోట మండలం రత్నగిరి గ్రామానికి చెందిన రైతు తమ్మినేని సూర్యచంద్రవరప్రసాద్ తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నార

శరవేగంగా వంతెన మరమ్మతు పనులు

నేడే స్లాబు నిర్మాణం
తీరనున్న కష్టాలు
ప్రస్తుతానికి ఖర్చంతా ఎంఎల్‌ఎ ధర్మరాజుదే

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువపై నారాయణపురం- ఉండి రాష్ట్రీయ రహదారి (ఆర్అండ్‌బి) శాఖకు చెందిన నారాయణపురం బ్రిడ్జి మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం స్లాబు నిర్మాణం పూర్తి చేయనున్నారు. 1931లో బ్రిటీష్ పాలకులు వంతెన నిర్మాణ పనులు చేపట్టిన 20 నెలల్లోనే పూర్తి చేసి 1933 జనవరి నుంచి వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. బ్రిటీష్ అధికారులు ఐరన్ గెడ్డర్లు, షాక్ అబ్జర్లు, స్లాబుకు వినియోగించే ఇనుము సమస్తం లండన్ నుంచే తీసుకొచ్చారు. నారాయణపురం రైతులే ఈవంతెనను దగ్గరుండి నిర్మింప చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా బోర్డు ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణం ఆనాటి పాలకులు చేపట్టారు. అంతర్ రాష్ట్ర, జిల్లాలకు అనుసంధానంగా ఉండే ఈ వంతెన ప్రాధాన్యత సంతరించుకుంది. అలాంటి ఈబ్రిడ్జి జూన్ 15న పడమర వైపు వంతెనకు సరిగ్గా మధ్యలో స్లాబు కొంత మేరకు రంధ్రం పడింది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రజలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. భారీ వాహనాలు, బస్సులు రెండు ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్తున్నాయి. వంతెన లేక జనాల ఇబ్బందులపై ప్రజాశక్తిలో అనేక కథనాలు ప్రచురితమైన సంగతి పాఠకులకు విదితమే.

నిధులు లేక... పెట్టుబడి పెడుతున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణా రాష్ట్రాలకు చెందిన ఆర్‌టిసి బస్సు, ముఖ్యంగా ఆక్వా ఉత్పత్తులు సైతం ఇదే వంతెన మీదుగా దేశంలో అనేక రాష్ట్రాలకు నిత్యం 250 నుంచి 300 పైగా లారీల్లో


పనుల పురోగతిని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

చేపలు, రొయ్యలు తదితర మత్స్య ఆహార ఉత్పత్తులు రవాణా అవుతున్నాయి. దీనికి తోడు ధాన్యాగారంగా పేరుగాంచిన ఈ జిల్లాల్లో ధాన్యం ఉత్పత్తులు సైతం అంతే స్థాయిలో రవాణా జరుగుతోంది. అలాంటి ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరితే కొత్త వంతెన నిర్మాణానికి గత పుష్కరకాలంగా ఆనాటి ఎంఎల్‌ఎలు వట్టి వసంతకుమార్, గన్ని వీరాంజనేయులు, పుప్పాల వాసుబాబులతో పాటు ప్రస్తుత ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజులు ప్రయత్నాలు చేసినప్పటికీ కేబినెట్ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చినా నిధుల దగ్గరకు వచ్చేటప్పటికీ చిల్లి గవ్వ ఇవ్వలేదు. దీంతో కనీసం మరమ్మతులు చేయండి బాబోయ్.. అని స్థానికులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేదు. ఆర్అండ్‌బి శాఖ ఉన్నతాధికారులు సైతం ఈ వంతెనను పరిశీలించి వెళ్లారు. అయినా వారిలో ఎలాంటి స్పందన లేకపోవడంతో జనాలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఎంఎల్‌ఎ ధర్మరాజు మరమ్మతులకు కావాల్సిన మెటీరియల్‌ను సమకూర్చారు. ఆర్అండ్‌బి అధికారుల పర్యవేక్షణలో ఈ నెల 1వ తేదీ నుంచి వంతెన మరమ్మతు పనులు ప్రారంభించారు.

రిపేర్ తీరు ఇలా..

వంతెన స్లాబును పూర్తిగా తొలగించారు. ఫిల్లర్‌పై ఉన్న పది ఇనుప గెడ్డర్లల్లో నాలుగు తుప్పు పట్టాయి. వాటికి ప్రత్యేకంగా తీసుకొచ్చిన ఐరన్ గెడ్డర్లతో కలిపి అధునాతన విధానంలో వెల్డింగ్ పనులు ఆరు రోజుల పాటు నిరాటంకంగా కొనసాగాయి. దీంతో 1933లో ఐరన్ కమ్మెలు ఎంత దృఢంగా ఉన్నాయో ఇంచుమించే అదే పటుత్వం వచ్చేలా నిపుణుల బృందం శ్రమించారు. ఐరన్ గెడ్డర్లు తుప్పు పట్టకుండా రెండు కోటింగులు సిల్వర్ ఆక్సైడ్ రంగు వేయించారు. ప్రత్యేకంగా డిజైన్ చేయించిన ఇనుక రేకును గెడ్డర్లపై బిగించారు. గెడ్డర్‌కు ఇనుక రేకుకు మరింత పట్టు ఉండేలా స్టంట్స్ రాడ్స్ వెల్డింగ్ చేశారు. వాటిపై 16 ఎంఎం, 12 ఎంఎం మందం కలిగిన ఊచలతో డబుల్ మేట్ మెస్ కడుతున్నారు. దాదాపు ఆరు టన్నుల ఇనుము, 15 టన్నుల మెటల్, 12 యూనిట్ల ఇసుక, 500 బస్తాల సిమెంట్‌తో 12 అంగుళాల మందంగా స్లాబు వేయనున్నారు.

ప్రజలు ఇబ్బందులు తీర్చేందుకే సొంత నిధులతో చేయిస్తున్నా ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ఈ వంతెన ప్రాధాన్యత ఎంతో ఉంది. నిత్యం అనేక మంది దీని మీదుగా రాకపోకలు చేయాల్సి ఉంది. కొత్త వంతెన ప్రతిపాదనలు, ఎస్టిమేషన్ ప్రభుత్వం దృష్టిలో ఉంది. పురాతన వంతెనల మరమ్మతులకు నిధులు రావడంలో ప్రభుత్వానికి అనేక సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. అందుకే జనాలకు ఇబ్బందుల నుంచి ఉపశమనం కల్గించేందుకు సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నాం.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

పలుచోట్ల 'స్వాస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

ఆగిరిపల్లి : మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఆగిరిపల్లి పిహెచ్‌సిలో స్వస్త్ నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ యోజన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్‌కలెక్టర్ బి.వినూత్న, ఆగిరిపల్లి ఎంపిడిఒ బి.భార్గవి, తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, మండలాధ్యక్షులు ఎన్.వేణు పాల్గొన్నారు.

చింతలపూడి : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలపడతాయని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహించే స్వాస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

జీలుగుమిల్లి : మహిళలు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సూచించారు. జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళల కోసం ఏర్పాటు చేసిన పోషకాహార కిట్లను పరిశీలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని కామయ్యపాలెం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు పి.మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులను ఎంఎల్‌ఎ పరామర్శించి అండగా ఉంటామని చెప్పారు.

కొయ్యలగూడెం : కిశోర బాలికలకు కూడా రక్తహీనత పరీక్షలు చేపడతామని ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం వెల్లడించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని భావిస్తూ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలో మండల మహిళా సమాఖ్య భవనం వద్ద స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తస్లీమా ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు.


ఉంగుటూరు : చేబ్రోలు సిహెచ్‌సి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేన్సర్ వ్యాధి అవగాహన, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

ముసునూరు : ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని తహశీల్దార్ డి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని గోపవరం, చెక్కపల్లి, వలసపల్లి గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యులు షకినా ఇవాంజిలిన్ తెలిపారు.

తరుగుమూల ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని కైకలూరు ఎంఎల్‌ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. 2006లో కేటాయించిన ఇళ్ల స్థలాల ఒరిజినల్ పట్టాలను స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు బుధవారం ఆయన చేతుల మీదుగా అందించారు. ప్రతి పట్టాదారుడు ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉండాలని, మెరక, విద్యుత్, తాగునీరు వంటివి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులు


పట్టాలు అందిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను దుశ్శాలువాలతో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జ సురేష్ బాబు, సర్పంచి మెండ ఝాన్సీ, ఉపసర్పంచి నాగలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం పోరాట ఫలితంగానే పట్టాల పంపిణీ

సిపిఎం ఆధ్వర్యంలో మండవల్లి తరుగుమూల ఇందిరమ్మ ఇళ్ల స్థలాల లబ్ధిదారులు దశలవారీగా చేసిన పోరాట ఫలితంగా కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్, తహశీల్దార్ ఒరిజినల్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం పట్ల


మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారుల పోరాట కమిటీ ఏర్పాటు చేసి దశలవారీగా చేసిన పోరాట ఫలితంగా లబ్ధిదారుల ఒరిజినల్ పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇళ్ల స్థలాల పూడిక చేసి ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు.



అవార్డు అందుకుంటున్న విజయబాబుయాదవ్

పాన్ ఇండియా బెస్ట్ టీచర్‌గా విజయబాబు యాదవ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ టీచర్స్ అసోసియేషన్ వారు గుంటూరులో నిర్వహించిన పాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డులో భాగంగా పట్టణంలోని శ్రీ వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ కొణతం విజయబాబుయాదవ్ పాన్ ఇండియా బెస్ట్ టీచర్ అవార్డ్ అందుకున్నట్లు స్కూల్ మేనేజ్‌మెంట్ బుజ్జి బాబు, శ్రీకాంత్, అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కలిసి ప్రిన్సిపల్ విజయ బాబు యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయులే మంచి విద్యావంతులను తయారు చేయగలరన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ సమాజం బాగుపడాలంటే ఉపాధ్యాయుల వల్ల అవుతుందన్నారు. తల్లిదండ్రుల తర్వాత ఆస్థానం ఒక్క చదువు చెప్పే గురువుకే లభిస్తుందని ఎఒ అనిల్ కుమార్ చెప్పారు.

మందుల ప్రతిచర్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మందుల వినియోగంలో ఎదురయ్యే ప్రతి చర్యలపై అప్రమత్తంగా ఉండాలని విజయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ డైరెక్టర్ తనుజ, ప్రిన్సిపల్ వినయ్‌కుమార్ అన్నారు. జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ముదినేపల్లిలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదికర్మ యోగి అభియన్'తో మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి - టి.నరసాపురం

పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే ఆదికర్మ యోగి అభియాన్ లక్ష్యమని ఎంపిడిఒ జి.నగరాజ కుమారి తెలిపారు. కృష్ణాపురంలో ఆది కర్మ యోగి అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆదికర్మ యోగి అభియాన్ పథకంలో ఎంపికైన గ్రామాల్లో 2030 సంవత్సరం లోపు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మోదుగు సునంద, డిఎంటి పొన్నారి, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం 12వ వార్డుకు చెందిన వాసే కాంతమ్మ నిరుపేద వృద్ధ మహిళ పూరి గుడిసె పాడవడంతో ఏ క్షణాన కూలిపోతుందోనని వివిధ వార్తా పత్రికల్లో వచ్చిన కథనానికి మానవత సంస్థ స్పందించింది. ఆ వృద్ధురాలికి బుధవారం రూ.13 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు కోనే వీరవెంకట సత్యనారాయణ, రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, తాతారావు, ఎర్రమిల్లిపాడు సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు, పాతూరి వంశీ, వార్డ్ మెంబర్ నత్త వెంకటేశ్వరావు, గంజి ప్రభాకర్, కొల్లబత్తుల నాగరాజు, గంజి రవి, రంధి జయ, ఎంపిటిసి సభ్యులు వెంకన్నబాబు పాల్గొన్నారు.

సొసైటీ కమిటీల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని మూడు సొసైటీలకు నూతన కమిటీలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశాయి. జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులుగా సరిపల్లి సత్యనారాయణ రాజు, సభ్యులుగా వనమా వెంకటేశ్వరావు, వెలగల అజయ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ములగలంపల్లి సొసైటీ అధ్యక్షులుగా గంగిరెడ్డి రాఘవయ్య, సభ్యులుగా పిన్నమనేని శ్రీను, అక్కిరెడ్డి ప్రభాకరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. దర్భగూడెం సొసైటీ అధ్యక్షుడుగా అక్కిశెట్టి విజయ్ ప్రసాద్, సభ్యులుగా కోనేటి హనుమంతరావు, సింగులూరి వెంకట రామారావు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన అధ్యక్ష, సభ్యులను కూటమి నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు.

అసంఘటిత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

సివిల్ సప్లై హమాలీలతో పాటుగా జిసిసి హమాలీలకు దసరా బోనస్ ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు హమాలి జట్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు సమావేశం స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో కారం రమేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ కుక్కునూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో విశ్రాంతి భవనం లేకపోవడంతో ఆరుబయట భోజనం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి దసరా బోనస్ సివిల్ సప్లై హమాలీలతో పాటుగా జిసిసి హమాలీలకు అందించాలని, విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హమాలీలు కడారి తిరపతయ్య, తిరోజుల సురేష్, నెర్రబోయిన సాయిరాం, మచ్చ చందు, మచ్చ లక్ష్మణ్, రామ్ చరణ్, బంధం విక్రమ్, సోడే వెంకటేష్, కుర్సం ముత్తేష్, సోడే లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు అందించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా, గౌరవ అధ్యక్షులు నేలపూలు ప్రభాకరరావు మాట్లాడుతూ స్థానిక ఎన్‌టిఆర్ నగర్, అంగన్వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించే కార్యక్రమంలో భాగంగా దాత వట్టూరి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో కుర్చీలు అందించినట్లు తెలిపారు. సంఘ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి పఠాన్ బాజీ, లింగం కుంట శ్రీనివాస్, అంగన్వాడీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి

భీమడోలు : రైతులు పంటకు నష్టం కలిగించే ఎలుకల నివారణకు వ్యక్తిగతంగా కన్నా సామూహిక చర్యలు చేపడితే ఉత్తమ ఫలితాలు వస్తాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు హబీబ్ భాషా అన్నారు. మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎలుకల మందుల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ప్రారంభించారు. అంబరుపేట రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులతో పాటు భీమడోలు సహాయ సంచాలకులు రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ ఎలుకల నిర్మూలన కోసం భీమడోలు మండలానికి 55 కేజీల మందు కేటాయించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని రైతు సేవా కేంద్రం వద్ద ఎలుకల నిర్మూలన, నివారణ మందు తయారీపై డెమో కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

19, 20 తేదీల్లో ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 19, 20వ తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 16 గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, గురుకుల బాలికల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీల సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ కోకో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడింటన్, చెస్, యోగా ఆటలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శైలజ, గంగుల నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు, హేమ, నాగమల్లేశ్వరి, లక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపిపి ఆరేపల్లి శిరీష అధికారులకు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ తాగునీరు, ప్రజారోగ్యం, పారిశుధ్య సమస్యలు తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జెడ్‌పి వైస్ ఛైర్మన్ జి.కృష్ణంరాజు మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరు దారుణమన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ చెన్నా రాఘవేంద్ర నాథ్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం ఆసుపత్రిచే కేన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొల్లగూడెం సూర్య పబ్లిక్ స్కూల్, జూనియర్ కాలేజీ వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్- రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో నిర్వహించారు. 180 మందికి పరీక్షలు నిర్వహించారు. బసవతారకం ఆసుపత్రి వైద్య సిబ్బంది సేవలు అందించారు. కాలేజీ ప్రిన్సిపల్ వేములపల్లి దుర్గాచైతన్యకుమార్, టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్, గ్రామ సర్పంచి శ్రీనివాసరావు, నారాయణపురం సొసైటీ చైర్‌పర్సన్ కడియాల రవిశంకర్, నాయకులు ఇమ్మని గంగాధర్, నెక్కలపూడి వీర వెంకట సత్యనారాయణ, చేబ్రోలు లయన్స్ క్లబ్ సభ్యులు బుల్లబ్బాయి, ప్రకాష్, వేగేశ్న సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.